క్లుప్తంగా

నియోజకవర్గంలో నేడు మంత్రి ఉత్తమ్ పర్యటన

హుజూర్‌నగర్ : రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా గరిడేపల్లి మండలం పొనుగోడులో జరిగే ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల్లో డైమండ్ జూబ్లీ వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం హుజూర్‌నగర్ మండలం లింగగిరి, మఠంపల్లి మండలం క్రిష్ణతండాలలో నూతన గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభిస్తారని మంత్రి కార్యాలయ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

యూరియా వాడకం తగ్గించాలి

చిలుకూరు : రైతులు వరి పొలానికి యూరియా వాడకం తగ్గించాలని కోదాడ వ్యవసాయ సంచాలకులు వాసు అన్నారు. శనివారం చిలుకూరులో ఆయన వరి పొలాలను పరిశీలించారు. వరికి యూరియా అధిక వాడకం వల్ల అగ్గి తెగులు రోగం వచ్చి దిగుబడి తగ్గుతుందని తెలిపారు. ప్రస్తుతం చలికి పొలాలు ఎదగడం లేదని, రైతులు కంగారు పడొద్దన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు చంద్రశేఖర్, శిరీష, రైతులు కొండా సోమయ్య, రవీందర్‌రెడ్డి, భుజంగరావు, పిల్లుట్ల కనకయ్య పాల్గొన్నారు.

29 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

మఠంపల్లి : మండల కేంద్రంలోని కానుకమాత దేవాలయం సిల్వర్ జూబ్లీ మహోత్సవం సందర్భంగా ఈనెల 29 నుంచి 31వరకు జిల్లా స్థాయి గ్రామీణ కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.15వేలు, రెండవ రూ.12వేలు, మూడవ రూ.10 వేలు, నాలుగవ రూ.8వేలు, ఐదవ బహుమతి రూ.6వేలు, షీల్డ్‌లు అందించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 3న మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలను సెల్ నంబర్లు 7569964233ను సంప్రదించాలన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున్

హుజూర్‌నగర్ : పట్టణంలోని 1వ వార్డులో నాటి ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిధులు రూ .5 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శనివారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జునరావు, కౌన్సిలర్ కొమ్ము శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ సహకారంతో పట్టణంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రాము, హనీఫ్, ఆంజనేయులు, కొండలు, సుజాత, రాజు తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

హుజూర్‌నగర్‌రూరల్ : పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వేపలసింగారంలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలోని 58 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స నిర్వహించినట్లు డాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ రూప్‌కుమార్, డాక్టర్ వీరారెడ్డి, చిలుకూరు మండల పశు వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి, పాడి రైతులు, సిబ్బంది ఉన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. అనంతరం కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే

హుజూర్‌నగర్ : థామస్ ఆల్వా ఎడిసన్ బల్బును కనిపెట్టిన రోజును తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ ఫెడరేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ పట్టణంలో ఎలక్ట్రీషియన్ డేగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా థామస్ ఆల్వా ఎడిసన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జక్కుల నాగేశ్వరరావు, ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచంద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, మండల అధ్యక్షుడు సైదారావు, ప్రధాన కార్యదర్శి సైదులు, సభ్యులు వీరబాబు, వెంగళరావు, లక్ష్మీనారాయణ, రవి, వీరబాబు, గౌస్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా వ్యర్థాల పారబోత


దొండపాడు శివారులో రోడ్డు పక్కన పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు


రామాపురం శివారులో ప్లాస్టిక్ వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో కాలిన హరితహారం చెట్లు

- రోడ్ల వెంట కుప్పలుగా పోసి నిప్పు పెడుతున్న వైనం
- అగ్నికి ఆహుతి అవుతున్న హరితహారం చెట్లు
- పొగ, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న బాటసారులు

హుజూర్‌నగర్ : చింతలపాలెం మండలంలోని దొండపాడు, మేళ్లచెరువు మండలం రామాపురం, యతిరాజపురం తదితర గ్రామాల మధ్య రోడ్డు పక్కన వ్యర్థాలు పారపోస్తున్నారు. ఎవరూ చూడని సమయాల్లో వాటిని కాల్చుతున్నారు. దీంతో పొగతో పాటు, దుర్గంధం వెదజల్లుతుండడంతో ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొగ కళ్లలోకి, ఊపిరితిత్తుల్లోకి వెళ్లి ప్రమాదకర జబ్బులు వస్తాయని భయాందోళన చెందుతున్నారు. అసలే పొగమంచు కారణంగా వాహనాలు ప్రమాదాలకు గురి అవుతున్నాయని, ఇలా రోడ్డు పక్కన వ్యర్థాలు కాల్చడంతో ఉత్పన్నమయ్యే పొగ ప్రమాదాలకు కారణం కావడానికి ఆస్కారం ఉందని పలువురు వాహనదారులు పేర్కొంటున్నారు. రోడ్డు వెంట కాల్చే వాటిలో ప్లాస్టిక్ వ్యర్థాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు. డంపింగ్ యార్డులకు తరలించాలిస్సిన వ్యర్థాలను గ్రామాల శివార్లలో పారబోసి నిప్పుపెడుతుండడంతో రోడ్డు పక్కన సమీపంలో నాటిన హరితహారం మొక్కలు కూడా అగ్నికి ఆహుతి అవుతున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వ్యర్థాలు పారబోసి నిప్పు పెట్టే వారిపై అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



దొండపాడు, రామాపురం శివారుల్లో రోడ్డుకు ఇరుపక్కల కొందరు వ్యర్థాలు తీసుకొచ్చి పారబోస్తున్నారు. వాటిని కాల్చుతుండడంతో పొగ, దుర్గంధం వస్తోంది. ఆ దారిలో రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వ్యర్థాలు రోడ్డు పక్కన పోయకుండా తగిన చర్యలు తీసుకోవాలి.

– కిరణ్ స్వేరో, ప్రైవేటు ఉపాధ్యాయుడు, చింతలపాలెం

గురుకుల పాఠశాల అభివృద్ధికి కృషి


బీసీ బాలికల గురుకుల పాఠశాల వార్షికోత్సవంలో విద్యార్థులతో ఎమ్మెల్యే పద్మావతి

- కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి

చిలుకూరు : మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డి అన్నారు. శనివారం చిలుకూరు మండలంలోని మిట్స్ కళాశాల ఆవరణలో గల మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల వార్షికోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్‌సీఓ శకీనా, పాఠశాల ప్రిన్సిపాల్ గజ్జెల అన్నపూర్ణ, సర్పంచ్ తమ్మనబోయిన శంకర్, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకుపాముల వాసికి అరుదైన అవార్డు


సుధాకర్‌గౌడ్

మునగాల : మండలంలోని ఆకుపాముల గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు పోలంపల్లి సుధాకర్‌గౌడ్‌కు ఇండియా ఎన్‌జీఓ, స్ఫూర్తి ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ అనే సంస్థ 'ప్రైడ్ ఆఫ్ భారత్ నేషనల్ అవార్డును శనివారం ప్రకటించింది. ఈ సందర్భంగా సుధాకర్‌గౌడ్ విలేకరులతో మాట్లాడారు. తాను ప్రస్తుతం పలు సేవా కార్యక్రమాలతో పాటు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడి హోదాలో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. తాను చేసిన సేవలను గుర్తించిన స్ఫూర్తి ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ అవార్డును ప్రకటించిందని తెలిపారు. ఈనెల 29న హైదరాబాద్‌లోని క్రాస్ రోడ్‌లో గల సిటీ కల్చరల్ ఆడిటోరియంలో తాను అవార్డు అందుకోనున్నట్లు సుధాకర్ గౌడ్ తెలిపారు. తన సేవలను గుర్తించి తనకు అవార్డు ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. అవార్డులు ముమ్ముందు మరింత సేవలు చేసేందుకు ప్రోత్సాహాన్ని ఇస్తాయన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

మునగాల : పేదలు గుడిసెలు వేసుకున్న భూములకు ప్రభుత్వం పట్టాలు అందజేసి వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లావ్యాప్తంగా ఎంఆర్‌ఓ కార్యాలయాల ఎదుట నిర్వహించబోయే ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు ములకలపల్లి రాములు కోరారు. శనివారం మునగాల మండల కేంద్రంలో పేదలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసైన్మెంట్ చట్టం ప్రకారం ప్రభుత్వ భూములు పేదల స్వాధీనంలో ఉంటే వారికి పట్టా హక్కులు కల్పించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సొంపంగు జానయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఆరె.రామకృష్ణారెడ్డి, మండల కమిటీ సభ్యులు కిన్నెర వెంకన్న, గద్దం వెంకన్న, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సత్యహరిశ్చంద్ర నాటకం


సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని గాంధీ పార్క్ వద్ద స్థానిక సప్తస్వర నాట్య కళా మండలి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ప్రదర్శించిన సత్యహరిశ్చంద్రీయము జానపద నాటకం పుర ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా హరిశ్చంద్రులుగా కంబాల శ్రీను, రామరాజు, కొత్తా భద్రయ్యాచారి, గుండు వెంకటేశ్వర్లు, నక్షత్రకులుగా భోగాల సంజీవరెడ్డి, బొమ్మన వెంకటశివ, విశ్వామిత్రునిగా నాగేందర్‌రెడ్డి, వీరబాహుడుగా భిక్షం, సత్యకీర్తిగా సోమిరెడ్డి సూరారెడ్డి, కాలకౌశికుడుగా నందిరెడ్డి యోగానందరెడ్డి, కేశవుడిగా రౌతు సాంబయ్య, చంద్రమతిగా సాదా వీరమ్మ, నాగమణిలు వ్యవహరించారు. పద్యాలు సభికులను అలరించాయి. కార్యక్రమంలో వాఖ్యత ధర్మారి వెంకటేశ్వర్లు, నిర్వాహకులు కొట్టుబాబు, విద్యుత్ అధికారి పాల్ రాజు, అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి, దూత వెంకటేశ్వర్లు, రమేష్ బాబు స్థానిక కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

మోతె : మండలంలోని మామిళ్లగూడెం గ్రామంలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణాకి శనివారం కోదాడ ఎమ్మెల్యే పద్మావతి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయానికి విద్యుత్ అవసరం నిమిత్తం నూతనంగా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ముప్పాని ఆశ, జెడ్పీటీసీ పుల్లారావు, సర్పంచ్ యల్లయ్య, విద్యుత్ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ప్రణాళికతో అభివృద్ధి

నడిగూడెం : ముందస్తు ప్రణాళికతోనే మండల అభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ యాతాకుల జ్యోతి తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో 2024– 25 ఏడాదికి గాను ముందస్తు ప్రణాళిక కోసం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో చేయాల్సిన పనులను ముందస్తుగా గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి వి.సతీష్ కుమార్, తహసీల్దార్ హేమామాలిని, వైఎస్ ఎంపీపీ బడేటి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఎస్‌డి.ఇమామ్, మండల వ్యవసాయాధికారి ఎం.రాజగోపాలరావు, విద్యుత్ శాఖ ఏఈ ఎస్‌కె.సైదా, ఏపీఎం రామలక్ష్మి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సైకిలిస్ట్‌కు 'పందిరి ఫౌండేషన్' సన్మానం


సైకిలిస్ట్ బాబును సన్మానిస్తున్న పందిరి ఫౌండేషన్ సభ్యులు

కోదాడ : అరవై సంవత్సరాలుగా నిత్యం సైకిల్ తొక్కుతూ.. సైకిల్ తొక్కండి..ఆరోగ్యాన్ని కాపాడుకోండి.. పర్యావరణాన్ని ప్రేమించండి అంటూ ప్రచారం చేస్తూ పర్యావరణ ప్రేమికుడిగా పేరు పొందిన కోదాడకు చెందిన పెయింటర్ బాబును ఆదర్శంగా తీసుకోవాలని పందిరి ఫౌండేషన్ చైర్మన్ పందిరి నాగిరెడ్డి కోరారు. శనివారం కోదాడలోని పందిరి ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బాబును ఆయన ఘనంగా సన్మానించారు. ప్రస్తుతం 70 సంవత్సరాల వయస్సులో కూడా ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా ఆరోగ్యంగా ఉండడానికి తాను నిత్యం సైకిల్ తొక్కడమే కారణమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి ఇమ్మడి సతీష్, గౌరవ సలహాదారు ఎస్ఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో క్విజ్ పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న గ్రంథాలయాధికారిణి లలితాదేవి

మునగాల : మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని పలు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతిని ప్రజ్ఞ హైస్కూల్ విద్యార్థులు, ద్వితీయ బహుమతిని ది మునగాల పబ్లిక్ స్కూల్ విద్యార్థులు గెలుపొందినట్లు గ్రంథాలయ అధికారిణి దేవబత్తిని లలితాదేవి తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా జిల్లేపల్లి మహేష్, గండు సతీష్, గోపాల్‌రెడ్డి, ఈశ్వర్, పవన్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయలక్ష్మి, సతీష్, బాబురావు అంబేద్కర్, మురళీమోహన్, గ్రంథాలయ పాఠకులు మోహన్, చైతన్య, మల్లికార్జున్, మురళి, రాకేష్, నవీన్, సిబ్బంది శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


స్వపరిపాలన వేడుకలో పాల్గొన్న బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు.. ఉపాధ్యాయుల వేషధారణలో తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. హెచ్ఎం లతీఫ్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, విద్యార్థినిలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యా, వైజ్ఞానిక మహాసభ పోస్టర్ ఆవిష్కరణ


వైద్య, వైజ్ఞానిక రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ షరీఫ్, టీపీటీఎఫ్ సంఘం నాయకులు

కోదాడఅర్బన్ : ఖమ్మంలో ఫిబ్రవరి 11, 12 తేదీల్లో జరిగే రాష్ట్ర ద్వితీయ విద్యా, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ బిక్షం పేర్కొన్నారు. శనివారం కోదాడలో మహాసభల పోస్టర్లను కోదాడ మండల విద్యాధికారి ఎండి సలీం షరీఫ్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, విశిష్ట అతిథులుగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, ఎంఎల్‌సీ ప్రొఫెసర్ కోదండరాం హాజరవుతారని ఆయన తెలిపారు. అతిథులుగా ప్రొఫెసర్ జగన్‌మోహన్‌సింగ్, ప్రొఫెసర్ హరగోపాలు పాల్గొంటారని తెలిపారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ రామనర్సయ్య, టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతరావు, సత్యనారాయణ, శ్రీనివాస్, వేణు, కృష్ణయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ వెలికితీసేందుకు టాలెంట్ టెస్టులు దోహదం


కోదాడఅర్బన్ : విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ రాణి, ఎంఈఓ షరీఫ్


హుజూర్‌నగర్ : విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఎంఈఓ సైదానాయక్

చిలుకూరు : టాలెంట్ టెస్టులతో విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకత వెలికితీయబడుతుందని ఎంపీపీ బండ్ల ప్రశాంతికోటయ్య అన్నారు. శనివారం చిలుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు ఆమె బహుమతులు అందజేశారు. ప్రైవేట్ పాఠశాల విభాగంలో ఇంగ్లిష్ మీడియంలో గ్లోబస్ ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాల విభాగంలో ఇంగ్లిష్ మీడియంలో బేతవోలు జెడ్పీ పాఠశాల విద్యార్థులు, తెలుగు మీడియం నుంచి రామాపురం జెడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. వీరికి వచ్చే నెల 3న మునగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎమ్ కరుణాకర్‌రెడ్డి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు చందా శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు గుండు ఆదినారాయణ, రాంరెడ్డి, ఖలీల్, అనంతరెడ్డి, స్వామి శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక కృషి అభినందనీయం

కోదాడఅర్బన్ : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి జన విజ్ఞాన వేదిన చేస్తున్న కృషి అభినందనీయమని కోదాడ ఎంపీపీ మల్లెల రాణి, మండల విద్యాధికారి ఎండి సలీం షరీఫ్ అన్నారు. శనివారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ విజేతలకు వారు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి బాలుర ఉన్నత పాఠశాల కోదాడ, జెడ్పీహెచ్ఎస్ పాలారం, ద్వితీయ శాంతినగర్, సింగారం పాఠశాలలు పొందాయని ఎంఈఓ తెలిపారు. జనవిజ్ఞాన వేదిక డివిజన్ బాధ్యులు డీఎస్‌స్వామి, జాఫర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి మొత్తం 16 టీమ్‌లు పాల్గొన్నాయి. వాటిలో జిల్లా స్థాయికి 3 జట్లు ఎంపికయ్యాయి. ప్రభుత్వ విభాగంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బూరుగడ్డ జెడ్పీహెచ్ఎస్, ప్రైవేటు విభాగంలో శ్రీ చైతన్య పాఠశాలలు ఎంపికైనట్లు జేవీవీ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, జిల్లా బాధ్యులు కలకుంట్ల సైదులు తెలిపారు. పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈఓ సైదానాయక్ మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం జయవాణిదేవి, అన్వేష్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నేరేడుచర్లలోని జెడ్పీహెచ్ఎస్‌లో..

నేరేడుచర్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయి చెకుముకి టాలెంట్ పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, క్రాంతినికేతన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సుంకరి క్రాంతికుమార్ బహుమతులు అందజేశారు. పోటీల్లో ప్రథమ బహుమతి దిర్శించర్ల జెడ్పీహెచ్ఎస్, ద్వితీయ నేరేడుచర్ల జెడ్పీహెచ్ఎస్, తెలుగు మీడియం విభాగంలో ప్రథమ బహుమతి జెడ్పీహెచ్ఎస్ మేడారం, ద్వితీయ జెడ్పీహెచ్ఎస్ దాచారం, ప్రైవేటు విద్యా సంస్థల నుంచి ప్రథమ బహుమతి పినాకిల్ హైస్కూల్ నేరేడుచర్ల, ద్వితీయ ప్రగతి విద్యాలయం గెలుచుకున్నాయి, కార్యక్రమంలో జేవీవీ మండల కన్వీనర్, న్యాయవాది చిత్రం విశ్వనాథ్,, కన్వీనర్ శ్రీను, పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, మాధవి, విజయ్‌కుమార్, సత్యనారాయణ, శ్యాం, జానయ్య, సైదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, అజీమ్, సైదా, రవి, వెంకటేశ్వర్‌రావు, నర్సింహారావు, రషీద్, కల్పన, నగేష్, శ్రవణ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

మఠంపల్లి : విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని జెడ్పీటీసీ జగన్‌నాయక్ కోరారు. శనివారం మఠంపల్లి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన మండల స్థాయి సైన్స్ చెకుముకి టాలెంట్ టెస్ట్ బహుమతుల ప్రధానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోటీలలో ఇంగ్లిష్ మీడియంలో ప్రథమ స్థానం టీఎస్ఎంఎస్ మఠంపల్లి, ద్వితీయ బహుమతి టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ, మఠంపల్లి, తెలుగు మీడియంలో జెడ్పీహెచ్ఎస్ వరదాపురం, మఠంపల్లి పాఠశాలలు కైవసం చేసుకున్నాయి. హెచ్ఎంలు రామకృష్ణ, వేణుగోపాల్, జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు నాగమణి, వెంకటేశ్వర్లు, అశోక్‌రెడ్డి, జలీల్, విష్ణు, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి ఎంపికైన 'ప్రజ్ఞ' విద్యార్థులు

మునగాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ప్రజ్ఞ హైస్కూల్ విద్యార్థులు మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రజ్ఞ స్కూల్ కరస్పాండెంట్ కాంసాని కృష్ణమూర్తి తెలిపారు. ఏ.సందీప్, టి.మున్నిమేఘన, డి.శ్రావణి గ్రూపు ప్రథమ బహుమతి గెలుచుకున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 3న జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను టాలెంట్ టెస్ట్ నిర్వాహకులు, ప్రధానోపాధ్యాయుడు దండు సీతారామరాజు అభినందించి ప్రశంసాపత్రాలు అందచేశారు.

విద్యుత్ మోటార్ల దొంగల అరెస్ట్

మోతె : వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ మోటార్లను అపహరిస్తున్న నలుగురు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. మోతె మండలం అన్నారిగూడెం గ్రామానికి చెందిన మండల సాయి, రెడ్డిమళ్ల లోకేష్, నాయిని వినయ్, శ్రీను వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. సులువుగా డబ్బులు సంపాదించాలని కొంతకాలంగా వీరు చోరీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి రంగాపురం తండా పరిధిలోని పాలేరు వాగులోకి వెళ్లి ఐదు కరెంట్ మోటార్లను అపహరించారు. వాటిని అన్నారిగూడెం గ్రామ శివారులోని ఉన్నం సత్యనారాయణ మామిడి తోటలో దాచిపెట్టారు. శనివారం వాటిని విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ఆటోలో వేసుకుని మామిళ్లగూడెం టోల్‌గేట్ వద్దకు చేరుకోగా అక్కడ వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు పట్టుపడ్డారు. మోటార్లను స్వాధీనం చేసుకుని, నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

నేడు వైద్య శిబిరం

గరిడేపల్లి : మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జిలకర రామస్వామి శనివారం అన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వివాహిత అదృశ్యం


సరిత

మునగాల(కోదాడ): వివాహిత అదృశ్యమైంది. మునగాల మండలం కలకోవ గ్రామానికి చెందిన దండు సరిత భర్త విజయ్‌తో ఘర్షణ పడి ఎవరికీ చెప్పకుండా ఈనెల 25న ఇంటినుంచి బయటకు వెళ్లింది.రెండు రోజులైనా తిరిగి రాకపోవడంతో సరిత తల్లిదండ్రులు కృష్ణమ్మ, వెంకటరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేష్‌కుమార్ తెలిపారు.

ఆర్టీసీ బస్సులు పునరుద్ధరించాలని వినతి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని రేబల్లె, ఇతర గ్రామాలకు నిలిపివేసిన ఆర్టీసీ బస్సులు పునరుద్ధరించాలని చింతలపాలెంకు చెందిన మోర్తాల నాగిరెడ్డి కోరారు. ఈమేరకు కోదాడ ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు బస్సులు నడపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

కమిషనర్‌కు సన్మానం

నేరేడుచర్ల : నేరేడుచర్ల మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లు ఉత్తమ కమిషనర్‌గా ఎంపికైన సందర్భంగా ఆయనను నేరేడుచర్లలో శనివారం బీఎస్‌పీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీఎస్‌పీ జిల్లా కన్వీనర్ రాపోలు నవీన్‌కుమార్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉపేందర్, నియోజకవర్గ అధ్యక్షుడు జిలకర వీరస్వామి, పట్టణ అధ్యక్షుడు కర్రి సతీష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సురేష్‌బాబు, నాగార్జున, వెంకటేశ్వర్లు, పవన్, నవీన్ తదితరులు ఉన్నారు.

ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

మునగాల : మునగాల మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శనివారం సీనియర్ జర్నలిస్టు జీఎస్‌రెడ్డి సమక్షంలో సమావేశమై ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడిగా బెజవాడ గోవర్ధన్, అధ్యక్షుడిగా జె.జె.సామ్యూల్‌సన్, ప్రధాన కార్యదర్శిగా షేక్ దస్తగిరి, ఉపాధ్యక్షుడిగా ఎల్.నాగబాబు, జాయింట్ సెక్రటరీగా తుమ్మల వెంకటేశ్వర్లు, కోశాధికారిగా సొంపంగు గోపి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా దామెర రవి, అనంతుల శ్రీనులను ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.